మీ సమస్యను
మీడియాకు చెప్పాలని ఉందా?
M.V.S.G.TILAK M.Sc., B.Ed.
Uttarandra Regional Bureau Chief
MANAM daily paper AP & TG
journalist.tilak03@gmail.com
Whatsapp : 9494524365
Please send ur news items,
we will publish it on our platform.
manamepaper.com
సంప్రదించండి



మనం
జనం కోసం అక్షర యజ్ఞం...
ఉమ్మడి
ఉత్తరాంధ్ర జిల్లాలు
మంగళవారం | 20 | అక్టోబర్ | 2026 పేజీలు : 08

# నర్సీపట్నం మున్సిపాలిటీలో 11 నామినేషన్లు తిరస్కరణ

**నర్సీపట్నం , అక్టోబర్ 19 ( మనం న్యూస్ ) :** నర్సీపట్నం మున్సిపాలిటీలో సోమవారం నిర్వహించిన వార్డు నామినేషన్ల పరిశీలనలో 11 నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. ఈ మేరకు అధికారులు ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం 280 నామినేషన్లు సక్రమంగా ఉన్నట్లు వెల్లడించారు. పార్టీల వారీగా పరిశీలిస్తే టీడీపీ నుంచి 134, వైసీపీ నుంచి 110, జనసేన నుంచి 25, ఇతరుల నుంచి 11 నామినేషన్లు సక్రమంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. వైసీపీకి చెందిన రెండు నామినేషన్లు తిరస్కరణకు గురైనట్లు సమాచారం...ఆ రెండు సీట్లు టీడీపీ ఏకగ్రీ కానున్నాయి..



# జిల్లాలో మున్సిపల్, పరిషత్ ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం

- ఫిర్యాదులేమైనా ఉంటే రాజకీయ పక్షాల ప్రతినిధులు పరిశీలకులకు ఫోన్ చేయవచ్చు
- పొలిటికల్ పక్షాల ప్రతినిధుల సమావేశంలో జిల్లా కలెక్టర్
- ఫిర్యాదుల కోసం వ్యయ పరిశీలకులు పి.వి.సందీప్ రెడ్డి ఫోన్ నెంబర్ 9440810041
- సాధారణ పరిశీలకులు ఎ.భార్గవ్ తేజ్ ఫోన్ నెంబర్ 70955 99001



2వ పేజీలో

**విశాఖపట్నం , అక్టోబర్ 19 ( మనం న్యూస్ ) :** జిల్లాలో మున్సిపల్ కార్పొరేషన్, ఎం.పి.టి.సి, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిషోర్ పేర్కొన్నారు. సోమవారం సాధారణ పరిశీలకులు, వ్యయ పరిశీలకులు, జీవీఎంసీ కమిషనర్ తో కలిసి కలెక్టర్ పొలిటికల్ పార్టీల ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జీవీఎంసీ ఎన్నికలకు సంబంధించి ఇప్పటికే నామినేషన్ల ప్రక్రియ పూర్తి అయ్యిందని, ఈ నెల 21న పోటీలో నున్న తుది జాబితా వస్తుందని తెలిపారు. ఎన్నికల నిర్వహణ కోసం సుమారు 11వేల మంది ఎన్నికల సిబ్బందిని నియామకం చేయడం జరిగిందనీ, వీరికి మొదటి రాండమైజేషన్ పూర్తయ్యిందని,

# అల్లూరి సీతారామరాజు జిల్లాలో పరిషత్ ఎన్నికలకు సర్వం సిద్ధం

- అక్టోబర్ 21 నుంచి 23 వరకు నామినేషన్ల స్వీకరణ
- ఎంపీటీసీ అభ్యర్థుల నామినేషన్లు సంబంధిత ఎంపీడీవో కార్యాలయాల్లో స్వీకరణ
- జెడ్పీటీసీ అభ్యర్థుల నామినేషన్లు జిల్లా పరిషత్ సీఈఓ కార్యాలయంలో స్వీకరణ
- అక్టోబర్ 27న మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం
- నవంబర్ 3న పోలింగ్, నవంబర్ 5న ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి



2వ పేజీలో

**పాడేరు , అక్టోబర్ 19 ( మనం న్యూస్ ) :** అల్లూరి సీతారామరాజు జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శ్రీమతి టి. నిశాంతి తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 21 నుంచి 23 వరకు

# ఎన్నికల పర్యవేక్షణకు ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లు

### ఫిర్యాదుల పరిష్కారానికి రెండు షిఫ్టుల్లో సిబ్బంది నియామకం

**పోలవరం జిల్లా (చింతూరు ,రంపచోడవరం , అక్టోబర్ 19 ( మనం న్యూస్ ) :** స్థానిక సంస్థల ఎన్నికలను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పోలవరం జిల్లా, మండల స్థాయిల్లో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కె. దినేష్ కుమార్ తెలిపారు. ఎన్నికల ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కారాన్ని నిరంతరం పర్యవేక్షించేందుకు సిబ్బందిని రెండు షిఫ్టుల్లో నియమించినట్లు సోమవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. కలెక్టరేట్, జిల్లా పరిషత్ కార్యాలయంతోపాటు రంపచోడవరం, చింతూరు రెవెన్యూ డివిజన్ల పరిధిలోని మండలాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, నిర్ణీత సమయంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫిర్యాదుల కోసం సంప్రదించాల్సిన నంబర్లు:- కలెక్టరేట్ కంట్రోల్



రూమ్: 1800-425-4225- జిల్లా పరిషత్ కార్యాలయం: 9441123704 ఎన్నికలకు సంబంధించిన సమస్యలు, ఫిర్యాదులను ప్రజలు ఈ నంబర్లకు తెలియజేయాలని కలెక్టర్ సూచించారు.

# అల్లూరి సీతారామరాజు జిల్లాలో పరిషత్ ఎన్నికలకు సర్వం సిద్ధం

**ఒకటి తరువాయి** నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఎన్నికల తేదీలు, నామినేషన్ల ప్రక్రియ, ఎన్నికల నిబంధనలు, మార్గదర్శకాలపై అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలకు అవగాహన కల్పించేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

**నామినేషన్ల స్వీకరణకు ప్రత్యేక ఏర్పాట్లు**

ఎంపీటీసీ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులు తమ నామినేషన్లను సంబంధిత మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) కార్యాలయాల్లో సమర్పించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. జెడ్పీటీసీ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థుల నామినేషన్లను జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ, జెడ్పీ) కార్యాలయంలో స్వీకరిస్తారని పేర్కొన్నారు. అభ్యర్థులు నామినేషన్ పత్రాలను ఎన్నికల నిబంధనల ప్రకారం పూర్తిగా నింపి, అవసరమైన పత్రాలను జతచేసి, నిర్ణీత గడువులోగా సమర్పించాలి. నామినేషన్ల స్వీకరణకు సంబంధించి రిటర్నింగ్ అధికారులు జారీ చేసే సూచనలు, నోటీసులు, అధికారిక మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

**ఎన్నికల షెడ్యూల్ వివరాలు, తేదీ :**

ఎన్నికల కార్యక్రమం : అక్టోబర్ 19, 2026 , రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఎన్నికల నోటిఫికేషన్. అక్టోబర్ 21, 2026
నామినేషన్ల స్వీకరణ ప్రారంభం. అక్టోబర్ 23, 2026 నామినేషన్ల స్వీకరణకు చివరి తేదీ. అక్టోబర్ 24, 2026. నామినేషన్ల పరిశీలన . అక్టోబర్ 25, 2026 తిరస్కరించిన నామినేషన్లపై అప్పీళ్ల దాఖలు. అక్టోబర్ 26, 2026, అప్పీళ్ల పరిష్కారం. అక్టోబర్ 27, 2026 మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ. అక్టోబర్ 27, 2026 మధ్యాహ్నం 3 గంటల తర్వాత పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితా ప్రకటన. నవంబర్ 3, 2026 పోలింగ్ – ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు. నవంబర్ 4, 2026. అవసరమైన చోట రీపోలింగ్
నవంబర్ 5, 2026. ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు, అనంతరం ఫలితాల ప్రకటన

**ఎన్నికల నిర్వహణకు సంబంధించిన గణాంకాలు**

జిల్లాలో మొత్తం 11 జెడ్పీటీసీ స్థానాలు, 172 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా 616 పోలింగ్ కేంద్రాలు ఉండగా, మొత్తం ఓటర్ల సంఖ్య 4,98,467గా ఉందని వివరించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లు, సిబ్బంది కేటాయింపు, ఎన్నికల సామగ్రి, ఇతర అవసరమైన ఏర్పాట్లపై సంబంధిత అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని సూచించారు. ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి అవసరమైన మార్గదర్శకాలు అందించి, ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

**ఓటర్లకు విస్తృత అవగాహన కల్పించాలి**

ప్రజాస్వామ్య ప్రక్రియలో ఓటు హక్కు ప్రాధాన్యతను ప్రజలకు వివరించేందుకు గ్రామాలు, మండలాల స్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ టి. నిషాంతి తెలిపారు. ఎన్నికల తేదీలు, పోలింగ్ కేంద్రాల వివరాలు, నామినేషన్ల ప్రక్రియ, ఎన్నికల ప్రవర్తనా నియమావళి తదితర అంశాలపై ప్రజలకు అధికారిక సమాచారం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికలకు సంబంధించిన వార్తలు, ప్రకటనలు, అభ్యర్థుల వివరాలను ప్రచురించే ముందు సంబంధిత ఎన్నికల అధికారుల నుంచి సమాచారాన్ని ధ్రువీకరించుకోవాలని మీడియా ప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల సమయంలో నిర్ధారించని సమాచారం ప్రచారం కాకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఎన్నికల షెడ్యూల్, నామినేషన్ల స్వీకరణ సమయాలు, అప్పీళ్ల ప్రక్రియ, నామినేషన్ల ఉపసంహరణ, ఇతర నిబంధనలకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల కమిషన్ అధికారిక నోటిఫికేషన్, సంబంధిత ఎన్నికల అధికారుల ఉత్తర్వులను అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు తప్పనిసరిగా అనుసరించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి టి. నిషాంతి తెలిపారు.

# పాడేరు ఘాట్ రోడ్డులో ప్రమాదంపై ఉప ముఖ్యమంత్రివర్యుల విచారం

**పాడేరు , అక్టోబర్ 19 ( మనం న్యూస్ ) :** పాడేరు ఘాట్ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు భవాని భక్తులు మృతి చెందిన ఘటన పట్ల రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు శ్రీ పవన్ కళ్యాణ్ గారు విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రమాదానికిగల కారణాలను ఏఎస్ఆర్ జిల్లా కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. చోడవరం మండలం, జుట్టాడ గ్రామానికి చెందిన భక్తులతో వెళ్తున్న బొలెరో వాహనం మలుపులో కొండరాయిని ఢీకొట్టడంతో ప్రమాదం జరిగిందని, ఈ ఘటనలో ఇరువురు ప్రాణాలు కోల్పోగా, సుమారు 20 మంది గాయపడినట్టు కలెక్టర్ తెలిపారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకుని తిరిగి వెళ్తున్న సమయంలో ప్రమాదం జరగడం కలచివేసిందని ఉప ముఖ్యమంత్రివర్యులు చెప్పారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు.

# జిల్లాలో మున్సిపల్, పరిషత్ ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం

**ఒకటి తరువాయి** 21న పరిశీలకుల సమక్షంలో రెండవ రాండమైజేషన్ జరుగుతుందని తెలిపారు. మూడవ రాండమైజేషన్ ఒక రోజు ముందు జరుగుతుందని, ఎవరికి ఎక్కడ కేటాయించింది ఆ రోజు తెలుస్తుందని తెలిపారు. పోలింగ్ పూర్తయిన తర్వాత ఓట్ల లెక్కింపు కోసం ఆంధ్రా యూనివర్సిటీ లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్స్ లో భద్రపరచడం జరుగుతుందన్నారు. 30న కౌంటింగ్ జరుగుతుందని, 3లేదా 4 రౌండ్లలో లెక్కింపు పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ ఎన్నికలకు సంబంధించి ఇంతవరకు ఎటువంటి ఫిర్యాదులు అందలేదని అన్నారు. మోడల్ కోడ్ అమలు పై నిఘా ఉంచడం జరిగిందని తెలిపారు. పరిషత్ ఎన్నికలకు సంబంధించి 4జెడ్పీటీసీ, 53 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరుగుతాయని, ఇందుకోసం సుమారు 3వేల మంది సిబ్బందిని సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ నెల 21 నుండి 23 వరకు నామినేషన్ల ప్రక్రియ జరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం ఎంపిడిఓ కార్యాలయాల్లో స్ట్రాంగ్ రూమ్స్ పెట్టడం జరిగిందని, నవంబర్ 5న ఓట్ల లెక్కింపు జరుగుతుందని తెలిపారు. ఎన్నికల పరిశీలకులు భార్గవ్ తేజ్ మాట్లాడుతూ రాజకీయ పార్టీలు ఎన్నికల కోడ్ ఉల్లంఘన జరగకుండా చూడాలని, శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించేందుకు సహకరించాలని తెలిపారు. ఎన్నికల ఫిర్యాదుల కోసం తన ఫోన్ నెంబర్ 70955 99001 కు కాల్ చేయవచ్చునని తెలిపారు. వ్యయ పరిశీలకులు పి.వి.సందీప్ రెడ్డి మాట్లాడుతూ కొన్ని పోలింగ్ స్టేషన్లను, జోనల్ లెవెల్ స్ట్రాంగ్ రూమ్స్ ను, శిక్షణల ను తనిఖీ చేయడం జరిగిందనీ, ఇప్పటివరకు అంతా సవ్యంగా జరుగుతోందని తెలిపారు. ఎన్నికల ఫిర్యాదుల కోసం తన ఫోన్ నెంబర్ 9440810041 కు కాల్ చేయవచ్చునని తెలిపారు. జీవీఎంసీ కమిషనర్ కేతన గార్గ్ మాట్లాడుతూ పొలిటికల్ పార్టీలు పోలింగ్ ఏజెంట్లను నియమించుకోవాలని సింగిల్ విండో ద్వారా అనుమతులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో జెసి విద్యాధరి, డి.ఆర్.ఓ విశ్వేశ్వర నాయుడు, సి.ఈ.ఓ నారాయణ మూర్తి, డీపీఓ శ్రీనివాస్, టిడిపి, బిజెపి, సిపిఐ(ఎం), ఐ ఎన్ సీ, జే ఎస్ పి, ఆప్, బీఎస్పీ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎన్నికల వేళ శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా పోలీసు ఆంక్షలు : ఈస్ట్ ఏసీపీ లక్ష్మణ మూర్తి



**విశాఖపట్నం , అక్టోబర్ 19 ( మనం న్యూస్ ) :** ప్రస్తుతం జరగుతున్న జీవీఎంసీ ఎన్నికల నేపథ్యంలో విశాఖపట్నం తూర్పు సబ్ డివిజన్ పరిధిలో శాంతి భద్రతలకు ఎటువంటి విఘాతం కలగ కుండా కఠిన ఆంక్షలు విధించామని ఈస్ట్ సబ్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ కె.లక్ష్మణమూర్తి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్) సెక్షన్ 163 కింద పలు నిషేధాజ్ఞలు జారీ చేశామన్నారు. ఇవి అక్టోబర్ 19వ తేదీ సోమవారం అర్ధరాత్రి నుంచి డిసెంబర్ 2వ తేదీ బుధవారం అర్ధరాత్రి వరకు అమల్లో ఉంటాయని తెలిపారు. ఆంక్షల్లో భాగంగా ముందస్తు అనుమతి లేకుండా ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది ఒకచోట గుమిగూడడాన్ని నిషేధించా మన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్నందున బాణసంచా కాల్చడంపైనా నిషేధం విధించా మన్నారు. ప్రభుత్వ అధికారులు, పోలీసు సిబ్బంది, ఆర్మీ, పారామిలటరీ బలగాలు, ఎన్నికల కౌంటింగ్ విధుల్లో ఉన్న సిబ్బందికి ఈ నిబంధనల నుంచి మినహాయింపు ఉంటుందన్నారు. మార్కెట్లు, షాపింగ్ ప్రాంతాలు, ఆటస్థలాలు, విద్యా సంస్థలు, బస్‌స్టేషన్లలో సాధారణ కార్యకలాపాలకు ఎలాంటి ఆటంకం ఉండదని స్పష్టం చేశారు. ప్రజలకు ప్రాణ, ఆస్తి నష్టం కలిగించే ఆయుధాలు, తుపాకులు, మందుగుండు సామగ్రిని బహిరంగంగా తీసుకెళ్లడం లేదా ప్రదర్శించడం నిషేధించా మన్నారు. డ్యూటీలో ఉన్న లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బందికి మాత్రమే మినహాయింపు ఉంటుందన్నారు. ఎన్నికల విజయోత్సవ యాత్రలు, ఊరేగింపులు, బహిరంగ సభలపైనా నిషేధం విధించా మన్నారు. అత్యవసర ప్రజా ప్రకటనలు, ముందస్తు అనుమతితో నిర్వహించే మతపరమైన కార్యక్రమాలు మినహా లౌడ్‌స్పీకర్లు, శబ్ద కాలుష్య పరికరాల వినియోగానికి అనుమతి లేదని తెలిపారు. అధికారుల ముందస్తు అనుమతి లేకుండా బహిరంగ ప్రదేశాల్లో పోస్టర్లు, బ్యానర్లు, కరపత్రాలను ప్రదర్శించడం, అంటించడం లేదా పంపిణీ చేయడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. అధికారిక లేదా ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులను కలిగి ఉన్న వ్యక్తులను ఓట్ల లెక్కింపు ఏజెంట్లుగా నియమించ రాదని స్పష్టం చేశారు. నిషేధాజ్ఞలను ఉల్లంఘించిన వారిపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్ 223తో పాటు ఇతర సంబంధిత చట్టాల కింద కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఆంక్షలను కఠినంగా అమలు చేయాలని మహారాణిపేట, టుటౌన్, త్రీటౌన్, ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ల సీఐలను, సిబ్బందిని ఆదేశించా మన్నారు.

# ఏడుగురాళ్లపల్లి వైసిపి ఎంపీటీసీ అభ్యర్థిగా నాంచారి ఎంపిక

## వైఎస్సార్‌సీపీలోనే కొనసాగుతా.. పార్టీకి రాజీనామా చేయలేదు : శ్యామల విజయ్ రెడ్డి



**పోలవరం జిల్లా (చింతూరు , అక్టోబర్ 19 ( మనం న్యూస్ ) :** చింతూరు మండలం ఏడుగురాళ్లపల్లి ఎంపీటీసీ అభ్యర్థిగా బొడ్డుగూడెం గ్రామానికి చెందిన ఉయికా భద్రు భార్య నాంచారిని ఎంపిక చేసినట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. సోమవారం బొడ్డుగూడెం గ్రామంలో మాజీ సొసైటీ చైర్మన్ శ్యామల విజయ్ రెడ్డి నివాసంలో నిర్వహించిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో చింతూరు మాజీ జడ్పీటీసీ సభ్యుడు చిచ్చడి మురళి, మండల కన్వీనర్ రామలింగారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సుధాకర్, మరో మాజీ వైస్ ఎంపీపీ ఎడమ అర్జున్ తదితరులు పాల్గొన్నారు. పార్టీ బలోపేతం, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై నాయకులు చర్చించినట్లు తెలిసింది.

**వైఎస్సార్‌సీపీలోనే కొనసాగుతా – శ్యామల విజయ్ రెడ్డి**

ఈ సందర్భంగా శ్యామల విజయరెడ్డి మాట్లాడుతూ, కొన్ని చిన్నచిన్న విషయాల వల్ల తాను మనస్తాపానికి గురయ్యానని, అంతేతప్ప వైఎస్సార్‌సీపీ సభ్యత్వానికి రాజీనామా చేయలేదని స్పష్టం చేశారు. తన వెన్నంటే ఉన్న కార్యకర్తల కోసం వైఎస్సార్‌సీపీలోనే కొనసాగుతానని, తన ప్రాంత ప్రజల అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. తనను ఆదరిస్తూ, తన కుటుంబంపై ప్రేమాభిమానాలు చూపిస్తున్న ప్రతి ఒక్కరికీ జీవితాంతం సేవ చేసే భాగ్యాన్ని తన తండ్రి శ్యామల వెంకటరెడ్డి నుంచి నేర్చుకున్నానని, తాను కూడా అదే బాటలో నడుస్తున్నానని పేర్కొన్నారు. ప్రాణం ఉన్నంతవరకు కార్యకర్తల సంక్షేమం కోసం, నిరుపేదలు, మధ్యతరగతి ప్రజల అభ్యున్నతి కోసం తన రాజకీయ ప్రయాణాన్ని కొనసాగిస్తానని స్పష్టం చేశారు. పార్టీ తనకు ఎంతో గౌరవం ఇచ్చిందని, సొసైటీ చైర్మన్‌గా అవకాశం కల్పించిందని గుర్తుచేశారు. పార్టీతో తనకున్న అనుబంధం ఎప్పటికీ కొనసాగుతుందని, చిన్నచిన్న విభేదాలను పెద్దవిగా చూడాల్సిన అవసరం లేదని తెలిపారు. శ్యామల విజయ్ రెడ్డి వ్యాఖ్యలతో ఆయన వైఎస్సార్‌సీపీకి రాజీనామా చేశారన్న ప్రచారంపై స్పష్టత వచ్చినట్లయింది. స్థానికంగా పార్టీ నాయకుల మధ్య సమన్వయం కొనసాగితే, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి మరింత బలం చేకూరుతుందని నాయకులు భావిస్తున్నారు.

# కూనవరంలో సీపీఎం..వైసీపీ ఎన్నికల పొత్తు ఖరారు

## జడ్పీటీసీ అభ్యర్థిగా వైసీపీ పోటీ.. ఎంపీపీ పదవి సీపీఎంకు కేటాయింపు

**కూనవరం , అక్టోబర్ 19 ( మనం న్యూస్ ) :** పోలవరం జిల్లా కూనవరం మండలంలో సీపీఎం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ) మధ్య ఎన్నికల పొత్తు ఖరారైంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఇరు పార్టీలు సీట్ల సర్దుబాటుపై ఒక నిర్ణయానికి వచ్చాయి. పొత్తులో భాగంగా జడ్పీటీసీ అభ్యర్థిగా వైసీపీ నుంచి పోటీ చేయాలని ఇరు పార్టీలు నిర్ణయించాయి. పదవుల పంపకంలో ఎంపీపీ పదవిని సీపీఎంకు కేటాయించగా, వైస్ ఎంపీపీ, కో-ఆప్షన్ పదవులను వైసీపీకి కేటాయించారు. అదేవిధంగా మండలంలోని ఎంపీటీసీ స్థానాల విషయంలోనూ ఇరు పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు కుదిరింది. మొత్తం ఎంపీటీసీ స్థానాల్లో వైసీపీ నాలుగు స్థానాల్లో, సీపీఎం నాలుగు స్థానాల్లో పోటీ



చేయాలని నిర్ణయించాయి. ఈ పొత్తుతో కూనవరం మండలంలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఇరు పార్టీల మధ్య సీట్ల పంపకం ఖరారైంది. ఎన్నికల్లో పరస్పర సహకారంతో ముందుకు సాగేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

# అనకాపల్లి జోన్ లో వార్డుల వారీగా పోటీ చేస్తున్న అభ్యర్థులు

**అనకాపల్లి , అక్టోబర్ 19 ( మనం న్యూస్ ) :** 107వ వార్డు: టీడీపీ నుంచి మాదం శెట్టి చినతల్లి, శీరంశెట్టి రేణుక నామినేషన్లు. బీజేపీ నుంచి బలిన లక్ష్మీ బాయి, వైసీపీ నుంచి వస్తీరు వెంకటలక్ష్మి, వస్తీరు వరలక్ష్మి పత్రాలు అందజేశారు. 108వ వార్డు: టీడీపీ నుంచి మక్క కృష్ణకుమారి, కొంజాతాల సింధుజా, వైసీపీ నుంచి బోడ్డెడ సరోజిని, పెంటకోట తులసీ నామినేషన్లు. 109వ వార్డు: టీడీపీ నుంచి బోడ్డేడ వరలక్ష్మి (రెండు సెట్లు), జనసేన నుంచి బుద్ధ జ్యోతి, వైసీపీ నుంచి కర్రి లలిత, కర్రి పూజిత, కాంగ్రెస్ నుంచి కోరిపిల్లి నూకబారతి. 110వ వార్డు: జనసేన నుంచి తాడి శాంతికుమారి, తాకాశి సూర్యపద్మ, వైసీపీ నుంచి ఉగ్గిన జ్యోత్స్న, టెంకాల సుబ్బ లక్ష్మి. కాంగ్రెస్ నుంచి గోరపట్టం దేవి, బీఎస్పీ నుంచి పరి దుర్గా దేవి, బీజేపీ నుంచి వీసం కనకమహాలక్ష్మి. 111వ వార్డు: బీజేపీ నుంచి వలకా యశోద, గేదెల దేవిసూర్య మణిదీపిక, వైసీపీ నుంచి శీలం నదియా, సేనాపతి జ్యోతి, స్వతంత్రులుగా కోలపర్తి అరుణకుమారి, బోసాల దేవి, కె.వెంకటలక్ష్మి. టీడీపీ తరఫున కూడా నామినేషన్. ఇదే వార్డు నుంచి మజ్జి మంజుల టీడీపీ, స్వతంత్ర అభ్యర్థిగా. 112వ వార్డు: జనసేన నుంచి ఆళ్ల వైష్ణవి, వైసీపీ నుంచి జాజుల ప్రసన్నలక్ష్మి (రెండు సెట్లు), జాజుల ధనలక్ష్మి (ఒక సెట్), తుట్లా ప్రియాంక కాంగ్రెస్ నుంచి నామినేషన్లు ఆర్వోలు శాస్త్రి, సత్యకుమార్లకు అందజేశారు

# నోటీసు బోర్డులో నోటిఫికేషన్ ప్రతులు ప్రచురణ



**గొలుగొండ , అక్టోబర్ 19 ( మనం న్యూస్ ) :** గొలుగొండ మండలంలో ఎంపీటీసీ ఎన్నికల నోటిఫికేషన్ నోటీసు బోర్డులో ప్రచురణ రాష్ట్ర ఎన్నికల సంఘం మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ (ఎంపీటీసీ) సభ్యుల ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేసిన నేపథ్యంలో, గొలుగొండ మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల నోటిఫికేషన్ ప్రతులను నోటీసు బోర్డులో ప్రచురించడం జరిగింది. జిల్లా కలెక్టర్ ద్వారా నియమితులైన రిటర్నింగ్ అధికారి సీహెచ్. గణేష్ , ఏ ఒ, డిప్యూటీ ఎంపీడీవో మరియు కార్యాలయ సిబ్బంది సమక్షంలో నోటిఫికేషన్ ప్రతులను నోటీసు బోర్డులో ప్రదర్శించడమైనది . మండల ప్రాదేశిక సభ్యులు ఎన్నికలకు సంబంధించి 21-10-2026 తేదీన నోటిఫికేషన్ మరియు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కానున్నట్లు రిటర్నింగ్ అధికారి తెలిపారు. ఎన్నికల షెడ్యూల్, నామినేషన్ల స్వీకరణకు సంబంధించిన ఇతర వివరాలు, నిబంధనలను రిటర్నింగ్ అధికారి ద్వారా తెలియజేయడం జరుగుతుంది అలాగే, ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో పోలీస్ యాక్ట్, 1861లోని సెక్షన్ 32 అమలులో ఉన్నందున, ప్రజలందరూ సంబంధిత నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు అధికారులకు సహకరించాలని కోరడమైనది.



విశాఖలో కూతురు కనిపించట్లేదని తల్లి ఆందోళన.. సిపి వాట్సాప్ నెంబర్ కు ఫిర్యాదు పోలీసు కమీషనర్ డా.శంఖబ్రత బాగ్చి, ఐ.పి.ఎస్., ఆదేశాలతో కొద్ది గంటల్లోనే చేధించిన కంచరపాలెం పోలీసులు తన కూతురు ఇంటి నుండి కనిపించకపోవడంతో ఆందోళనకు గురైన తల్లి రాపేటి దేవి కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు ఫిర్యాదు అందుకున్న వెంటనే స్పందించిన కంచరపాలెం పోలీసులు, సీఐ కోరాడ రామారావు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందంగా ఏర్పడి గాలింపు చేపట్టారు. కొద్ది గంటల్లోనే బాలిక ఆచూకీ కనుగొని తల్లిదండ్రులకు అప్పగించారు. క్షేమంగా కూతురు తిరిగి రావడంతో తల్లిదండ్రులు ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. సకాలంలో స్పందించి తమ బిడ్డను క్షేమంగా తీసుకొచ్చిన కంచరపాలెం సీఐ కోరాడ రామారావు ఎస్సై అరుణ... మరియు సిబ్బందికి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. పోలీసుల సూచన: పిల్లల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అనుమానం ఉన్నా వెంటనే 100 లేదా స్థానిక పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు

**: అక్టోబర్ 19 ( మనం న్యూస్ ) విశాఖ**

# శబరి తీరాన ఆధ్యాత్మిక వైభవం

## దుర్గామాత సన్నిధిలో నవచండీ హోమం

**నవరాత్రి ఉత్సవాల్లో తొమ్మిదో రోజు విశేష పూజలు.. గ్రామాభివృద్ధి, లోకకల్యాణం కోసం ప్రత్యేక యజ్ఞం**

**చింతూరు , అక్టోబర్ 19 ( మనం న్యూస్ ) :** పవిత్ర శబరి నదీ తీరాన వెలసిన చింతూరు దుర్గామాత, పార్వతీ విశ్వేశ్వర స్వామివారి ఆలయం నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. జగన్మాత అనుగ్రహం, గ్రామ ప్రజల సుఖసంతోషాలు, ప్రాంత సర్వతోముఖాభివృద్ధి, లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ నవరాత్రి ఉత్సవాల్లో తొమ్మిదో రోజు అత్యంత భక్తిశ్రద్ధలతో నవచండీ హోమాన్ని నిర్వహించారు. వేదమంత్రోచ్చారణలు, చండీపారాయణం, హోమాగ్ని జ్వాలల నడుమ జరిగిన ఈ పవిత్ర క్రతువులో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలను కోరుకున్నారు.



### వేదమంత్రాలతో మార్మోగిన ఆలయ ప్రాంగణం

నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆలయంలో ప్రతిరోజూ అమ్మవారికి విశేష అలంకరణలు, అర్చనలు, అభిషేకాలు, ఇతర సంప్రదాయబద్ధ పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. తొమ్మిదో రోజు నిర్వహించిన నవచండీ హోమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. శాస్త్రోక్త విధానంలో నిర్వహించిన హోమంలో భక్తులు పాల్గొని గ్రామం సుభిక్షంగా ఉండాలని, ప్రజల ందరికీ ఆయురారోగ్య ఐశ్వర్యాలు కలగాలని ప్రార్థించారు. ఈ ఆలయంలో అమ్మవారిని భక్తితో కొలిస్తే కోరిన కోరికలు నెరవేరుతాయన్న ప్రగాఢ విశ్వాసం ఈ ప్రాంత ప్రజల్లో ఉంది. దీంతో నవరాత్రి ఉత్సవాల సందర్భం గా స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు.

### భక్తిగీతాలతో ఆధ్యాత్మిక సందడి

ఆలయ ప్రాంగణంలో ప్రతిరోజూ సాయంత్రం 7 నుంచి రాత్రి 9 గంటల వరకు మారుతి శివ సాయి భజన బృందం సభ్యులు భక్తిగీతాలను ఆలపిస్తూ ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత పరిపుష్టం చేస్తున్నారు. అమ్మవారి నామస్మరణ, శివనామ సంకీర్తనలతో ఆలయ పరిసరాలు భక్తిరసమయంగా మారుతున్నాయి. నవరాత్రి వేళ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి.

### విజయదశమి వేళ శమీపూజకు ప్రత్యేక ప్రాధాన్యం

విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయంలో శమీపూజను అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా దుర్గామాతను విశేషంగా అలంకరించి, ఆలయం నుంచి శమీ వృక్షం వరకు అమ్మవారి ఉత్సవ ఊరేగింపును నిర్వహించి సంప్రదాయబద్ధంగా పూజలు చేయడం ఈ ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. హిందూ ధార్మిక సంప్రదాయంలో శమీవృక్ష పూజకు విశిష్ట స్థానం ఉంది. విజయానికి, శుభానికి, ధర్మరక్షణకు ప్రతీకగా భావించే శమీ వృక్షాన్ని విజయదశమి రోజున పూజించడం ఆనవాయితీ. ఈ పూజతో పాపాలు తొలగి, శుభాలు కలుగుతాయని భక్తులు విశ్వసిస్తారు. ఈ నేపథ్యంలో శమీపూజలో పాల్గొనేందుకు భక్తులు ఆసక్తి చూపుతున్నారు.

### పూజారుల ఆధ్వర్యంలో శాస్త్రోక్త క్రతువులు

ఆలయ ప్రధాన పూజారి కలగా ప్రసాద్ శర్మ, చండీ ఉపాసకులు గోకవరం చైతన్య శర్మ ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమాది ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సంప్రదాయ ఆచార వ్యవహారాలకు అనుగుణంగా సాగుతున్న ఈ ఉత్సవాలు చింతూరు ప్రాంతంలో భక్తి భావాన్ని, ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తు న్నాయి. పవిత్ర శబరి నదీ తీరాన వెలసిన దుర్గామాత ఆలయం నవరాత్రి వేళ భక్తజన సందోహంతో కళకళలాడుతుండగా, అమ్మవారి అనుగ్రహంతో గ్రామం, ప్రాంతం సుభిక్షంగా ఉండాలని భక్తులు ప్రార్థిస్తున్నారు. భక్తి, సంప్రదాయం, ఆధ్యాత్మికతల సమ్మేళనంగా సాగుతున్న ఈ నవరాత్రి ఉత్సవాలు చింతూరు ప్రాంత ప్రజలకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.





## ప్రతిరోజూ 2 అంజీర్ పండ్లను తింటే ఏమవుతుందో తెలుసా ?



అంజీర్ పండ్లు వీటిని తీసుకోవడం వల్ల మన శరీరానికి అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. వీటిని రోజూ రాత్రి పడుకునే ముందు నానబెట్టి ఉదయం తీసుకోవడం వల్ల దీన్ని లాభాలు డబుల్ అవుతాయి. అంజీర్ పండ్లు వీటిని తీసుకోవడం వల్ల మన శరీరానికి అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. వీటిని రోజూ రాత్రి పడుకునే ముందు నానబెట్టి ఉదయం తీసుకోవడం వల్ల దీన్ని లాభాలు డబుల్ అవుతాయి. అంజీర్ పండు ప్రతిరోజూ ఓ రెండు తీసుకోవడం వల్ల కలిగే లాభాలు ఏంటో తెలుసుకుందాం. అంజీర్‌లో డైటరీ ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఇందులో కరిగే కరగని ఫైబర్ రెండూ ఉంటాయి. అంజీర్ జీర్ణ ఆరోగ్యానికి మంచిది వీటిని మన డైట్లో చేర్చుకుని తీసుకోవడం వల్ల మలబద్ధకం సమస్య అనేది ఉండదు. అంతేకాదు ఆరోగ్యకరమైన పేగు కదలికలకు సహాయప డుతుంది. అంజీర్‌లో ఎన్నో విటమిన్స్, మినరల్స్ పుష్కలంగా ఉంటాయి. విటమిన్ కే, ఏ, పొటాషియం, కాల్షియం, మెగ్నీషి యం, ఐరన్ ఉండటం వల్ల ఇవి మన శరీర పనితీరుకు ఎంతో ఆరోగ్యకరం. అంజీర్ పండులో పొటాషియం కూడా ఎక్కువ మోతాదులో ఉ ంటుంది. ఇందులోని ఖనిజాలు గుండె ఆరోగ్యాన్ని నిర్వహిస్తాయి. ముఖ్యంగా అంజీర్‌లో ఫైబర్ అధిక మోతాదులో ఉ ంటుంది. ఇవి కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తాయి. గుండె సంబంధిత సమస్యలు రాకుండా చెక్ పెడతాయి. అంజీర్‌లో పాలీఫెనల్స్, ఫ్లెవనాయిడ్స్ అనే యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఫ్రీ రాడికల్ సమస్య రాకుండా మన శరీరాన్ని కాపాడతాయి. అంతేకాదు అంజీర్ పండ్లను తరచూ తీసుకోవడం వల్ల కేన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు దూరంగా ఉండొచ్చు. అంజీర్ పండులో ఫైబర్ అధిక మొత్తంలో ఉంటుంది. ఇది మన కడుపును ఎక్కువ సమయంపాటు నిండిన అనుభూతిని కలిగిస్తుంది. దీంతో మనం క్యాలరీలు తక్కువగా తీసుకన్నట్లవుతుంది. అంజీర్‌లో కాల్షియం, మెగ్నీషియం, ఫాస్పరస్ అధిక మోతాదులో ఉంటుంది. ఇది మన ఎముక ఆరోగ్యానికి మంచిది. ఆస్టియోపోరోసిస్ రాకుండా మన ఎముకలను అంజీర్ పండు కాపాడుతుంది. అంజీర్ పండ్లను మీ పిల్లలకు కూడా ఇవ్వండి వారి ఎముకలు దృఢంగా మారతాయి. డయాబెటిస్ ఉన్నవారికి తీయగా ఏదైనా తినాలనిపిస్తుంది. అటువంటి పరిస్థితుల్లో అంజీర్ పండును తినవచ్చు. ఈ పండు రుచి తింటే తీయగా ఉంటుంది. కానీ, మన రక్తంలో చక్కెర స్థాయిలను హఠాత్తుగా పెంచవు. డయాబెటిస్ వారు కూడా ఈ పండును డాక్టర్ సలహా మేరకు తీసుకోవచ్చు

# "కొండ దిగువన పూదోటలో విజయదశమి జమ్మివేట మహోత్సవానికి భారీ ఏర్పాట్లు!

**- "భక్తులకు అత్యంత చేరువగా సింహాద్రి అప్పన్న దివ్యదర్శనం**
**- ఈవో జల్లేపల్లి వెంకటరావు ప్రత్యేక పర్యవేక్షణ**



**సింహాచలం , అక్టోబర్ 19 ( మనం న్యూస్ ) :** కొండంత దేవుడు కొండ దిగి వచ్చే అపురూప వేడుకకు సింహాచలం సిద్ధమవుతోంది! విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 21న కొండ దిగువన పూదోట ప్రాంగణంలో నిర్వహించనున్న శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామివారి జమ్మివేట మహోత్సవానికి దేవస్థానం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ఆలయ ఈవో జల్లేపల్లి వెంకటరావు పర్యవేక్షణలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, స్వామివారిని అత్యంత సమీపం నుంచి దర్శించుకునేలా అవసరమైన సదుపాయాల కల్పనకు అధికారులు, సిబ్బంది అహర్నిశలు కృషి చేస్తున్నారు.

**అశ్వవాహనంపై గ్రామ వీధుల్లో సింహాద్రి అప్పన్న!**

విజయదశమి రోజున అమ్మవారితో కలిసి రామాలంకారంలో స్వామివారు ఛత్రచామరాలు, మంగళవాద్యాలు, వేదమంత్రాల నడుమ కొండ దిగువకు వేంచేస్తారు. చారిత్రక మెట్ల మార్గం మీదుగా తొలిపావంచా చేరుకుని భక్తులకు స్వామివారి దర్శనం అనుగ్రహించిన అనంతరం పైడితల్లమ్మ ఆలయంలో పూజలు స్వీకరించి పూదోటకు చేరుకుంటారు. పూదోటలో సంప్రదాయబద్ధంగా శమీ వృక్ష పూజ నిర్వహించి, శమీ పత్రాలను భక్తులకు ప్రసాదంగా అందజేస్తారు. అనంతరం అశ్వవాహనంపై స్వామివారు గ్రామంలోని మూడు ప్రధాన వీధుల్లో తిరువీధి ఉత్సవం నిర్వహించి భక్తులకు దర్శనమివ్వనున్నారు.

**భక్తుల సౌకర్యాలకు ప్రత్యేక ప్రాధాన్యం**

ఉత్సవ ప్రాంగణాల పరిశుభ్రత, మార్గాల్లో సదుపాయాలు, భక్తుల రాకపోకలు, ఇతర అవసరాలపై దేవస్థానం అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పూదోటలో సాంస్కృతిక కార్యక్రమాలు, భక్తిగీతాల ప్రదర్శనలకు కూడా ఏర్పాట్లు చేస్తున్నారు. విజయదశమి జమ్మివేట మహోత్సవానికి భక్తులు, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో విచ్చేసి సింహాద్రి అప్పన్న దివ్యదర్శనం చేసుకోవాలని ఈవో జల్లేపల్లి వెంకటరావు కోరారు. కొండంత దేవుడు కొండ దిగి వచ్చే పవిత్ర వేడుకలో పాల్గొందాం... శమీ పత్రాలను స్వీకరించి సర్వవిజయాలు, శుభాలు కలగాలని స్వామివారిని ప్రార్థిద్దాం!





## సింహాచల వరాహ లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకున్న ఐఏఎస్ అధికారి రోణంకి గోపాలకృష్ణ



**సింహాచలం , అక్టోబర్ 19 ( మనం న్యూస్ ) :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్య, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ జాయింట్ సెక్రటరీ రోణంకి గోపాలకృష్ణ , సోమవారం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు దేవస్థానం సహాయ కార్యనిర్వాహణాధికారి పిల్లా శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం రోణంకి గోపాలకృష్ణ ఆలయంలోని అత్యంత మహిమాన్వితమైన కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. తదుపరి శ్రీ స్వామివారిని దర్శించుకున్నారు. ?దర్శనానంతరం ఆలయ మండపంలో వేద పండితులు ఆయనకు వేద ఆశీర్వచనం పలకగా, ఏ ఈ ఓ స్వామివారి ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

## నర్సీపట్నం సమన్వయ బాధ్యతలు కొణతాలకి

**అనకాపల్లి , అక్టోబర్ 19 ( మనం న్యూస్ ) :** నర్సీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయ బాధ్యతలను మాజీ మంత్రివర్యులు, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణలి కి అప్పగించారు. పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబుకు కూడా ఈ బాధ్యతల్లో భాగస్వామ్యం కల్పించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పార్టీ సమన్వయ విధులను వీరిద్దరూ జనసేన పార్టీ తరఫున నిర్వహించాలని పార్టీ అధ్యక్షులు శ్రీ పవన్ కల్యాణ్ గారు ఆదేశించారు. ప్రస్తుతం నర్సీ పట్నం నియోజకవర్గ పి.ఓ.సి.గా ఉన్న రాజాన సూర్యచంద్రను ఆ బాధ్యతల నుంచి తొలగించారు. కొణతాల రామకృష్ణ పంచకర్ల రమేష్ లకు నర్సీపట్నం నియోజకవర్గ సమన్వయ బాధ్యతలు తక్షణమే అమల్లోకి వస్తాయని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం వెల్లడించింది.

# స్వామివారి అన్నప్రసాద ట్రస్టుకు రూ. 1 లక్ష విరాళం అందజేసిన దాత



**సింహాచలం , అక్టోబర్ 19 ( మనం న్యూస్ ) :** శ్రీ స్వామి వారికి విశాఖపట్నంకు చెందిన భక్తుడు అన్నే నరేన్ విరాళాన్ని అందజేశారు. సోమవారం నాడు ఆయన శ్రీ సింహాద్రినాథ నిత్య అన్న ప్రసాదమునకు రూ. 1,00,000/- (అక్షరాలా ఒక లక్ష రూపాయలు) విరాళంగా సమర్పించారు. విశాఖపట్నం, సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌కు చెందిన అన్నే నరేన్ పేరిట కెనరా బ్యాంక్ చెక్కును (చెక్ నెం: 709315) ఆలయ అధికారులకు అందజేశారు. అనంతరం దాతలకు స్వామివారి దర్శన భాగ్యం కల్పించారు. దర్శనానంతరం వేద ఆశీర్వచన మండపంలో వేద పండితులు వారికి వేద ఆశీర్వచనం పలికారు. ఆలయ అధికారులు వారికి శేష వస్త్రంతో సత్కరించి, శ్రీస్వామివారి ప్రసాదాలను అందజేశారు.

# ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలి : రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేతా

**విశాఖపట్నం , అక్టోబర్ 19 ( మనం న్యూస్ ) :** ప్రస్తుతం జరుగుతున్న మున్సిపల్, పరిషత్ ఎన్నికలు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా , ప్రశాంత వాతావరణం లో జరిగేలా జిల్లా కలెక్టర్లు, ఎస్.పి లు చూడాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేతా తెలిపారు. సోమవారం సెక్రెటరీ మల్లిఖార్జున, ఐ.జి రాజకుమారి తో కలసి ఆయన జిల్లా కలెక్టర్లు, ఎస్.పి లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికలకు అవసరమగు పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేసుకోవాలని, ప్రశాంత వాతావరణం లో జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాల్లో



నియమించిన సాధారణ పరిశీలకులు, వ్యయ పరిశీలకులు, పోలీస్ ఉన్నతాధికారులు పరిస్థితుల్ని సమీక్షించుకుని సమన్వయం తో పని చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, జీవీఎంసీ కమిషనర్ కేతన గార్గ్, పరిశీలకులు ఏ.భార్గవ్ తేజ్, వ్యయ పరిశీలకులు పి.వి.సందీప్ రెడ్డి, జే సి విద్యాధరీ, డి.ఆర్. ఓ విశ్వేశ్వర నాయుడు జిల్లా పరిషత్ సి.ఈ. ఓ నారాయణమూర్తి, డి.పి. ఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమార్చనలు



**కవిటి , అక్టోబర్ 19 ( మనం న్యూస్ ) :** శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కవిటి మండలం పెద్ద కపాసుకుద్ది గ్రామంలో కొలువైన గ్రామదేవత తోటమ్మ తల్లి సన్నిధిలో సామూహిక కుంకుమార్చనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి నామస్మరణలు, మంత్రోచ్చారణల మధ్య ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. శరన్నవరాత్రుల సందర్భంగా తోటమ్మ తల్లిని రోజుకో ప్రత్యేక అలంకరణతో ముస్తాబు చేసి భక్తులకు దర్శనమిచ్చారు. పండితులు నిరంజన్ స్వామి మంత్రోచ్చారణల నడుమ అమ్మవారికి ప్రత్యేక పూజలు



నిర్వహించారు. అనంతరం సుమారు 200 మంది మహిళలు సామూహికంగా కుంకుమార్చనలు చేసి, హారతులు సమర్పించారు. అమ్మవారి అనుగ్రహం తమ కుటుంబాలపై ఉండాలని, గ్రామం సుభిక్షంగా ఉండాలని భక్తులు ప్రార్థించారు.ఈ సందర్భంగా ఆలయానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన మహిళలు, భక్తులు తోటమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. భక్తుల భాగస్వామ్యంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇచ్చాపురం మున్సిపల్ కూటమి చైర్పర్సన్ అభ్యర్థి విజయం ఖాయం - ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే డాక్టర్ అశోక్

- ఆరు నెలల్లో మున్సిపల్ గ్రామాలకు పూర్తిస్థాయి పైప్ లైన్ నీటి సరఫరా
- పదేళ్లు మున్సిపాలిటీలో వైసీపీకి అధికారం - అభివృద్ధిలో అంధకారం
- వైసిపి అసత్య ప్రచారాలపై ఎమ్మెల్యే ఫైర్



**ఇచ్ఛాపురం , అక్టోబర్ 19 ( మనం న్యూస్ ) :** ఇచ్ఛాపురం మున్సిపల్ కూటమి అభ్యర్థి ఆసి లీలారాణి గెలుపు ఖాయమని ప్రభుత్వ విప్ ఇచ్ఛాపురం ఎమ్మెల్యే డాక్టర్ అశోక్ పేర్కొన్నారు. సోమవారం ఆయన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ.... టిడిపి జనసేన బిజెపి పార్టీలు సంయుక్తంగా సమన్వయంతో మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్నాయని, అపోహలు అవగాహన లోపం లేకుండా సాగుతున్నాయని స్పష్టం చేశారు. ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో గత పదేళ్లపాటు వైసీపీ అధికారంలో ఉన్నప్పటికీ, అభివృద్ధి శూన్యమని, దోచుకోవడానికి, వర్గాలుగా విడిపోయి మున్సిపాలిటీలో అభివృద్ధిని వెనుక వరుసలో పెట్టడానికి మాత్రమే వైసిపి పనికి వచ్చిందని విమర్శించారు. బహుద నది వంతెన పై వైసీపీ నేతలు కనీస అవగాహన కూడా లేకుండా అవాస్తవాలను ప్రచారం చేస్తూ, తమ అజ్ఞానని బయట పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. అసెంబ్లీ ఎన్నికల ముందు మాజీమంత్రి శ్రీ అప్పలరాజు హడావిడిగా శిలాఫలికాన్ని చీకట్లో ఆవిష్కరించి డ్రామా నడిపారని, వంతెన నిర్మాణానికి కావలసిన ఒక్క అడుగు కూడా అధికారికంగా ప్రారంభం కాలేదని అన్నారు. మున్సిపాలిటీలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు కూడా చేయలేకపోయారని, కూటమిప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మున్సిపాలిటీలోని సెంట్రల్ లైటింగ్ వేయించగలిగామని తెలిపారు. పురుషోత్తపురం అమీన్ సాహెబ్ పేట గ్రామాలకు పైపులైన్ ద్వారా నీరు ఇచ్చే పనులను మరో ఆరు నెలల్లో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

# 1983 నుంచి పార్టీ కోసం కష్టపడుతున్న కుటుంబానికి అన్యాయం జరిగింది

సీఎం చంద్రబాబుకు గాజువాక టీడీపీ కార్యకర్త ఆవేదన"



**గాజువాక , అక్టోబర్ 19 ( మనం న్యూస్ ) :** తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం (1983) నుంచి పార్టీ జెండాను మోస్తూ, ఎన్నో ఒడిదొడుకులను ఎదుర్కొని నిలబడిన ఒక నిబద్ధత గల కార్యకర్త కుటుంబానికి తీవ్ర అన్యాయం జరిగిందంటూ గాజువాక నియోజకవర్గంలో చర్చ మొదలైంది. గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ ) 85వ వార్డు పరిధిలో దశాబ్దాలుగా పార్టీ కోసం అహర్నిశలు శ్రమించిన సంద్రనా రామారావు (రాము)తమ కుటుంబానికి ఈసారి టికెట్ కేటాయింపులో తీవ్ర నిరాశే ఎదురైందని సదరు కార్యకర్త కుటుంబం ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడుకి వారు ఒక బహిరంగ విజ్ఞప్తిని పంపారు.

**వివాదాల సమయంలోనూ వెనకడుగు వేయని నిబద్ధత:**

1983లో పార్టీ స్థాపించిన నాటి నుంచి గ్రామీణ స్థాయిలో టీడీపీని బలోపేతం చేయడంలో తమ తల్లిదండ్రులు కీలక పాత్ర పోషించారని రాము గుర్తుచేశారు. ముఖ్యంగా 1989వ సంవత్సరంలో దివంగత నేత గురునాథరావు తో తీవ్ర రాజకీయ వివాదాలు నడుస్తున్న కష్టకాలంలో కూడా ప్రాణాలకు తెగించి, పార్టీ సిద్ధాంతాలను నమ్మి అండగా నిలబడ్డామని వివరించారు. ఇన్ని దశాబ్దాల సేవకు గుర్తింపుగా 85వ వార్డు కార్పొరేటర్ టికెట్ విషయంలో తమకు అవకాశం ఇవ్వకపోవడం తీవ్రంగా కలచివేసిందని ఆయన పేర్కొన్నారు.

**పల్లా శ్రీనివాసరావుకి కూడా తెలుసు:**

తమ కుటుంబానికి ఈ వార్డులో ఉన్న ప్రజాదరణ, ఇక్కడ టికెట్ ఇస్తే ఖచ్చితంగా గెలవగలమనే నమ్మకం నియోజకవర్గ ముఖ్య నాయకులు పల్లా శ్రీనివాసరావుకి సైతం తెలుసని, అయినా తమను పరిగణనలోకి తీసుకోకపోవడం వెనుక కారణం ఏంటో అర్థం కావడం లేదని సదరు కుటుంబం ప్రశ్నిస్తోంది. తాము ఏ సామాజిక వర్గానికి వ్యతిరేకం కాదని, కేవలం 40 ఏళ్లకు పైగా పార్టీ కోసం రక్తం చిందించిన కష్టానికి గుర్తింపు మాత్రమే కోరుతున్నామని స్పష్టం చేశారు.

**సీఎం చంద్రబాబు స్వయంగా జోక్యం చేసుకోవాలి:**

నిజమైన, కష్టపడే కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉండే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ విషయంలో స్వయంగా జోక్యం చేసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. 85వ వార్డు టికెట్ కేటాయింపు వ్యవహారాన్ని పునఃసమీక్షించి, పార్టీ కోసం దశాబ్దాలుగా త్యాగాలు చేసిన తమ కుటుంబానికి న్యాయం చేయాలని, ఒక అవకాశం కల్పించి ఆదరించాలని సదరు కార్యకర్త కుటుంబం మనస్ఫూర్తిగా విజ్ఞప్తి చేస్తోంది. పార్టీ అధిష్టానం ఈ కిందిస్థాయి కార్యకర్తల ఆవేదనను ఎలా స్వీకరిస్తుందో వేచి చూడాలి.

# ఎంపీటీసీ, జడ్పీటీసీ నామినేషన్లపై ఆర్వో దిశానిర్దేశం

**- ఈ నెల 21 నుంచి 23 వరకు నామినేషన్ల స్వీకరణ**
**- అభ్యర్థులు నిబంధనలు పాటించాలి.. పత్రాల సమర్పణలో జాగ్రత్తలు తీసుకోవాలి**



**కవిటి , అక్టోబర్ 19 ( మనం న్యూస్ ) :** ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఆర్వో), టెక్కలి అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ సి.హెచ్. చంద్రశేఖరరావు కోరారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో కవిటి ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో నామినేషన్ల స్వీకరణ, అభ్యర్థులు పాటించాల్సిన నిబంధనలు, అవసరమైన పత్రాలపై ఆయన దిశానిర్దేశం చేశారు.

**21 నుంచి నామినేషన్ల స్వీకరణ**

ఈ నెల 21వ తేదీ ఉదయం 10 గంటలకు ఎన్నికల నోటీసుతో పాటు ఎంపీటీసీ ఓటర్ల జాబితాను ఎంపీడీవో కార్యాలయ నోటీసు బోర్డులో ప్రదర్శించనున్నట్లు తెలిపారు. 21, 22, 23 తేదీల్లో ప్రతిరోజూ ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామని వెల్లడించారు. ఆర్వోతో పాటు సహాయ రిటర్నింగ్ అధికారులుగా ఎంపీడీవో, తహశీల్దార్‌లు వ్యవహరిస్తారని పేర్కొన్నారు.

**నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి**

రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి 100 మీటర్ల పరిధిలోకి అభ్యర్థితో పాటు ఒక వాహనాన్ని మాత్రమే అనుమతిస్తామని స్పష్టం చేశారు. కార్యాలయంలోకి అభ్యర్థితో పాటు ప్రతిపాదకుడు, మరో వ్యక్తి మాత్రమే ప్రవేశించేందుకు అనుమతి ఉంటుందని తెలిపారు. నామినేషన్ పత్రాల్లో అభ్యర్థి, ప్రతిపాదకుడి పేర్లను ఓటర్ల జాబితాలో ఉన్న విధంగానే నమోదు చేయాలని సూచించారు. ఎంపీటీసీ అభ్యర్థిని ప్రతిపాదించే వ్యక్తి సంబంధిత ప్రాదేశిక నియోజకవర్గానికి చెందిన ఓటరై ఉండాలని, పోటీ చేసే అభ్యర్థి మాత్రం మండల పరిధిలోని ఏ గ్రామానికి చెందిన ఓటరైనా అర్హులని వివరించారు.

**నామినేషన్ పత్రాలపై సహాయక కేంద్రం**

నామినేషన్ పత్రాల పూరణలో అభ్యర్థులకు సహకరించేందుకు ఎంపీడీవో కార్యాలయం వద్ద డిప్యూటీ ఎంపీడీవోల ఆధ్వర్యంలో సహాయక కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నామినేషన్ పత్రాల్లో కొట్టివేతలు లేకుండా, అన్ని వివరాలు పూర్తిగా నమోదు చేయాలని సూచించారు. అవసరమైన అదనపు ఫారాలను కూడా అందజేస్తామని పేర్కొన్నారు.

**పెండింగ్ పత్రాలకు గడువు**

నామినేషన్ డిపాజిట్‌ను నగదు రూపంలో లేదా బ్యాంకు, ట్రెజరీ చలానా ద్వారా చెల్లించవచ్చని, నగదు చెల్లింపులకు రశీదు అందజేస్తామని ఆర్వో తెలిపారు. కుల ధ్రువీకరణ పత్రం వంటి పెండింగ్ పత్రాలను నామినేషన్ల చివరి రోజైన 23వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు తప్పనిసరిగా సమర్పించాలని స్పష్టం చేశారు. గడువులోగా అవసరమైన పత్రాలను సమర్పించి, నిబంధనల ప్రకారం నామినేషన్ల ప్రక్రియను పూర్తి చేసుకోవాలని అభ్యర్థులకు సూచించారు.

# 112 కాల్ తో కదిలిన పోలీసులు - గంటలోనే తప్పిపోయిన బాలిక ఆచూకీ గుర్తింపు



**విశాఖ , అక్టోబర్ 19 ( మనం న్యూస్ ) :** ఆరిలోవలో తప్పిపోయిన 18 ఏళ్ల యువతి గంటలోనే ఆచూకీ – 112 కాల్ అందుకున్న వెంటనే స్పందించిన ఎస్సై బి . రాజేశ్వరి బృందం, రైల్వే స్టేషన్ లో గుర్తించి తల్లిదండ్రులకు అప్పగింత.



# లక్ష రూపాయల నాణాలతో కన్యకా పరమేశ్వరి అలంకరణ



**అనకాపల్లి , అక్టోబర్ 19 ( మనం న్యూస్ ) :** పట్టణంలో ప్రసిద్ధి చెందిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు నవ దుర్గలు గా భక్తులకు దర్శనమిచ్చారు, ఆలయ మండపంలో వేదసేవ శ్రీ చక్ర అభిషేకాలు నక్షత్ర హారతి గోపూజ నిర్వహించారు, అమ్మవారికి లక్ష రూపాయలు నాణాలతో అర్చన ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు వుప్పల రవిరామ్ జవహర్, కార్యదర్శి, శ్రీధరాల సోమరాజు, కోశాధికారి కడిమిశెట్టి అచ్యుతరామయ్య, ఉత్సవ కమిటీ చైర్మన్ గ్రంధి వివిఎస్ మాణిక్యం, భక్తులు తదిరులు పాల్గొన్నారు

# అనకాపల్లి జిల్లాకు బదిలీపై వెళ్తున్న మహిళా పిఎస్ డీఎస్పీ పి.వి.వి. నరసింహారావును ఘనంగా సన్మానించిన జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్,ఐపిఎస్




**విజయనగరం , అక్టోబర్ 19 ( మనం న్యూస్ ) :** విజయనగరం జిల్లా మహిళా పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీగా విధులు నిర్వహిస్తూ, బదిలీపై అనకాపల్లి సబ్ డివిజన్‌కు వెళ్తున్న డీఎస్పీ పి.వి.వి.నరసింహారావును అక్టోబర్ 5న జిల్లా పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్,ఐపిఎస్ ముఖ్య అతిధిగా హాజరయ్యి డీఎస్పీని శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్,ఐపిఎస్ మాట్లాడుతూ.. పోలీసు శాఖలో బాధ్యతాయుతమైన పదవిలో విధులు నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించడంలో డీఎస్పీ చేసిన సేవలు అభినందనీయమని అన్నారు. ముఖ్యంగా మహిళలు, బాలికల భద్రతకు సంబంధించిన సమస్యలపై సత్వర స్పందన, బాధితులకు న్యాయం అందించేలా చర్యలు తీసుకోవడంలో సమర్థవంతంగా విధులు నిర్వర్తించడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. మహిళా పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించిన సమయంలో మహిళలు, బాలికలకు సురక్షిత వాతావరణం కల్పించడంతో పాటు, మహిళలకు సంబంధించిన కేసుల దర్యాప్తును సమర్థవంతంగా నిర్వహించడంలో ప్రత్యేక శ్రద్ధ చూపారని జిల్లా ఎస్పీ తెలిపారు. విధి నిర్వహణలో క్రమశిక్షణ, అంకితభావం, సమన్వయంతో పనిచేసి పోలీసు శాఖకు మంచి పేరు తీసుకువచ్చారని అభినందించారు. ప్రస్తుతం అనకాపల్లి సబ్ డివిజన్‌లో కొత్త బాధ్యతలు స్వీకరించనున్న నేపథ్యంలో అక్కడ కూడా శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, ప్రజలతో సత్సంబంధాలు పెంపొందించడం ద్వారా సమర్థవంతమైన పోలీసింగ్ అందించాలని జిల్లా ఎస్పీ ఆకాంక్షించారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, పోలీసు శాఖపై ప్రజలకు మరింత నమ్మకం కలిగేలా విధులు నిర్వహించాలని సూచించారు. అనంతరం బదిలీపై వెళ్తున్న డీఎస్పీ గారు మాట్లాడుతూ, జిల్లాలో విధులు నిర్వహించే అవకాశం కల్పించినందుకు జిల్లా ఎస్పీ గారికి కృతజ్ఞతలు తెలిపారు. సహచర అధికారులు, సిబ్బంది అందించిన సహకారాన్ని ఎప్పటికీ మరువలేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ ఎస్పీ పి.సౌమ్యలత, మహిళా పోలీస్ స్టేషన్ సిఐ ఈ.నరసింహమూర్తి, ఇతర పోలీసు అధికారులు, మహిళా పోలీస్ స్టేషన్ సిబ్బంది, పాల్గొని బదిలీపై వెళ్తున్న డీఎస్పీకి శుభాకాంక్షలు తెలిపారు.

# అనకాపల్లి జిల్లాలో భారీ దొంగతనాల ముఠా గుట్టురట్టు..ముగ్గురు నిందితుల అరెస్ట్

- సుమారు 80.33 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలు, నగదు స్వాధీనం
- సాంకేతిక పరిజ్ఞానం, పోలీసుల సమష్టి కృషితో 28 కేసుల ఛేదన
- పరవాడ డీఎస్పీ కార్యాలయంలో మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన జిల్లా అదనపు ఎస్పీ ఎల్.మోహన రావు
- అధికారులు, సిబ్బంది ప్రతిభను ప్రశంసించిన జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఐపీఎస్







**పరవాడ , అక్టోబర్ 19 ( మనం న్యూస్ ) :** అనకాపల్లి జిల్లా వ్యాప్తంగా సంచలనం సృష్టించిన పలు దొంగతనాల కేసులను జిల్లా పోలీసులు అత్యంత చాకచక్యంగా ఛేదించారు. పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ బి.మోహన రావు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ (క్రైమ్స్) ఎల్.మోహన రావు కేసు వివరాలను అధికారికంగా వెల్లడించారు.

### కేసు నేపథ్యం:

మునగపాక పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంకటాపురం గ్రామానికి చెందిన కన్నం రమేశ్ అనే వ్యక్తి తన ఇంట్లో దొంగతనం జరిగిందని తేది. 06.10.2026న ఇచ్చిన ఫిర్యాదు మేరకు క్రైమ్ నం. 137/2026 ఖ/ం 331(4), 305(a) BNS కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

### పోలీసుల నిఘా - సాంకేతికతతో నిందితుల పట్టివేత:

జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి సాంకేతిక ఆధారాలు, పక్కా సమాచారంతో నిఘా ముమ్మరం చేశాయి. ఈ క్రమంలో తేది. 18-10-2026న అందిన విశ్వసనీయ సమాచారం మేరకు మునగపాక ఎస్సై పి.ప్రసాదరావు మరియు వారి సిబ్బంది అనకాపల్లి హైవే బస్ స్టాప్ వద్ద ముమ్మర వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో ఒకే ద్విచక్ర వాహనంపై వస్తున్న ముగ్గురు వ్యక్తులు పోలీసులను చూసి తప్పించుకునేందుకు ప్రయత్నించగా, సిబ్బంది వారిని చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న బ్యాగులను తనిఖీ చేయగా భారీగా బంగారు, వెండి ఆభరణాలు లభ్యమయ్యాయి.

### అరెస్టయిన నిందితుల వివరాలు:

చేపల ఆనంద్ (28), తండ్రి: అమ్మోరు, నివాసం: గంగవరం, పెదగంట్యాడ మండలం, విశాఖపట్నం జిల్లా. చిత్తరపు అభిషేక్ (23), తండ్రి: సన్యాసిరావు, నివాసం: దొమ్మేటి వీధి, పెదగంట్యాడ మండలం, విశాఖపట్నం జిల్లా. నిమ్మడా దిలీప్ (20), తండ్రి: దివంగత శ్రవణ్ కుమార్, నివాసం: బాలచెరువు వీధి, పెదగంట్యాడ మండలం, విశాఖపట్నం జిల్లా. నేర చరిత్ర - నేరాల శైలి: నిందితులు ముగ్గురూ గతంలో జైలుకు వెళ్లి బెయిల్‌పై విడుదలైన పాత నేరస్థులు. వీరు తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా బీరువాలు పగలగొట్టి ఆభరణాలు, నగదు చోరీ చేయడం, దుకాణాల షట్టర్లు తెరిచి దొంగతనాలకు పాల్పడటం చేసేవారు. నిందితులపై గతంలో విశాఖ, అనకాపల్లి పరిధిలోని పలు పోలీస్ స్టేషన్లలో మొత్తం 31 కేసులు నమోదై ఉన్నాయి (చేపల ఆనంద్‌పై 17 కేసులు, చిత్తరపు అభిషేక్‌పై 13 కేసులు, నిమ్మడా దిలీప్‌పై 1 కేసు). స్వాధీనం చేసుకున్న సొత్తు వివరాలు (మొత్తం విలువ సుమారు 80,33,823/-): బంగారు ఆభరణాలు: 442.652 గ్రాములు (సుమారు 37.95 తులాలు) - విలువ సుమారు 66,72,093/- వెండి వస్తువులు/ఆభరణాలు: 6,361.504 గ్రాములు (సుమారు 6.362 కిలోలు) - విలువ సుమారు 13,71,730/- నగదు: ?30,000/-

### ఛేదించిన కేసులు:

నిందితులను విచారించగా మునగపాక, నక్కపల్లి, రాంబిల్లి, పరవాడ, ఎలమంచిలి రూరల్, ఎలమంచిలి టౌన్, సబ్బవరం పోలీస్ స్టేషన్ల పరిధిలోని మొత్తం 28 దొంగతనాల కేసులకు సంబంధించిన సొత్తుగా గుర్తించి రికవరీ చేశారు.

### జిల్లా ఎస్పీ ప్రశంసలు - ప్రశంసా పత్రాల అందజేత:

కేసును అత్యంత ప్రతిభావంతంగా, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి తక్కువ సమయంలో ఛేదించిన పరవాడ డీఎస్పీ బి.మోహన రావు, ఎలమంచిలి సీఐ ధనుంజయరావు, పరవాడ సీఐ భాస్కర రావు, రాంబిల్లి సీఐ నర్సింగరావు, మునగపాక ఎస్సై పి.ప్రసాదరావులతో పాటు కీలక పాత్ర పోషించిన హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లను జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఐపీఎస్ ప్రత్యేకంగా అభినందించారు. మీడియా సమావేశం అనంతరం అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందజేశారు.





WANTED REPORTERS
మనం
జనం కోసం అక్షర యజ్ఞం...
రెండు తెలుగు రాష్ట్రాల్లో తనకంటూ ఓ ప్రత్యేకతను సంతరించుకుని ప్రజల గొంతుకై కొనసాగుతున్న మనం తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు విలేకరులు కావలెను. స్థానిక సమస్యలపై అవగాహన కలిగి తెలుగు భాషపై పట్టున్నవారు సంప్రదించగలరు..
కావలసిన జిల్లాలు
విశాఖపట్నం , అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు
పైన పేర్కొన్న జిల్లాలకు వాటి పరిధిలోని మండలాలకు రిక్రూట్మెంట్ జరుగుతుంది.
ఆసక్తి కలవారు సంప్రదించగలరు
విలేకరులు కావలెను (కాంటాక్ట్ ఇమీడియెట్లీ)
ఎం.వి.ఎస్.జి. తిలక్, ఉత్తరాంధ్ర రీజినల్ బ్యూరో చీఫ్
e-mail id : journalist.tilak03@gmail.com
సంప్రదించాల్సిన నెంబరు : 94945 24365

## గాజువాక బీజేపీలో ' - 97వ వార్డు టికెట్ల కేటాయింపుపై భగ్గుమన్న అసమ్మతి

**గాజువాక , అక్టోబర్ 19 ( మనం న్యూస్ ) :** గాజువాక భారతీయ జనతా పార్టీలో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. జీవీఎంసీ పరిధిలోని 97వ వార్డు సీటు కేటాయింపు వ్యవహారం పార్టీలో తీవ్ర దుమారానికి, అంతర్గత కుమ్ములాటలకు దారితీసింది. పార్టీ కోసం ఏడేళ్లుగా చెమటోడ్చిన నాయకులను పక్కనపెట్టి, స్థానికేతరులకు పెద్దపీట వేస్తున్నారన్న ప్రచారంపై క్షేత్రస్థాయి నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల అధ్యక్షులే స్వయంగా రాజీనామాలకు సిద్ధమవడం రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతోంది.

### లెక్కలేనితనంపై ఆగ్రహం..

కనీసం వంద ఓట్లు కూడా లేని ఒక సామాజిక వర్గానికి 97వ వార్డు టికెట్ కట్టబెట్టేందుకు కొందరు తెరవెనుక పావులు కదుపుతున్నారన్న సమాచారం పార్టీ శ్రేణుల్లో మంట పుట్టించింది. దశాబ్దాలుగా పార్టీని నమ్ముకుని ఉన్న బీసీ వర్గాలకు గానీ, లేదూ ఆ వార్డులో ఏకంగా 60 శాతానికి పైగా ఓటు బ్యాంకు ఉన్న కాపు సామాజిక వర్గానికి గానీ టికెట్ ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే ఎన్నికల్లో ఘోర పరాజయం తప్పదని హెచ్చరిస్తున్నారు.

### కేఎన్ఆర్ పట్ల వ్యవహరిస్తున్న తీరుపై మండిపాటు..

గడచిన ఏడేళ్లుగా గాజువాకలో బీజేపీని నడిపిస్తూ, పార్టీ జెండాను పట్టుకుని కష్టపడుతున్న నియోజకవర్గ ఇంచార్జి కరణంరెడ్డి నరసింగరావు (కేఎన్ఆర్)ను సైతం సంప్రదించకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడంపై మండల అధ్యక్షులు మండిపడుతున్నారు. పార్టీ కోసం నిత్యం శ్రమించే కేఎన్ఆర్‌కే సరైన న్యాయం జరగకపోతే, ఇక సామాన్య కార్యకర్తల పరిస్థితి ఏమిటని నిలదీస్తున్నారు. గెలుపు గుర్రాలకే టికెట్లు ఇస్తామన్న పెద్దలు, ఇప్పుడు ఓడిపోయే అభ్యర్థులకు 'బీ-ఫారమ్'లు ఇచ్చేందుకు సిద్ధమవడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేస్తున్నారు.

### తెగించిన మండల అధ్యక్షులు..

అధిష్టానం తన వైఖరిని మార్చుకోకపోతే తాము పదవులకు తక్షణమే రాజీనామా చేసి, పార్టీలో సామాన్య కార్యకర్తలుగా మాత్రమే కొనసాగుతామని తెగేసి చెప్పారు. గాజువాక బీజేపీలో అగ్గిరాజేసిన ఈ అసమ్మతి మంటలను పెద్దలు ఎలా చల్లార్చుతారో, ఎవరికి టికెట్ కేటాయిస్తారో వేచి చూడాల్సిందే!